క్లుప్తంగా

ఏటీడబ్ల్యూఓను నియమించండి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని గుమ్మలక్ష్మీపురం మండలానికి సహాయ గిరిజన సంక్షేమ అధికారిని (ఏటీడబ్ల్యూఓ) నియమించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. మండల ఏటీడబ్ల్యూఓగా పనిచేసిన బి.సురేష్‌కుమార్‌కు విశాఖపట్నం బదిలీ అయిందని, ఆస్థానంలో ఇంకా ఎవ్వరూ విధుల్లో చేరకపోవడం వల్ల గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పర్యవేక్షణ కరువైందని పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్న దృష్ట్యా నిరంతర పర్యవేక్షణ ఉండేలా సంక్షేమాధికారులకు తగిన సూచనలు, సలహాలందించేందుకు ఐటీడీఏ అధికారులు తక్షణమే ఏటీడబ్ల్యూఓను నియమించాలని కోరారు.

ఘనంగా రథాలమ్మ వారాల పండగ



మహిళల కోలాటం

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో మూడురోజుల పాటు జరిపే రథాలమ్మ వారాల పండగ రెండో రోజు మంగళవారం నిర్వహించారు. సాయంత్రం కోలాటం, డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఘటాలను ఊరేగించారు.బుధవారం ఘటాలను రథాలమ్మ గుడివద్దకు తీసుకువచ్చి మొక్కులు చెల్లించుకోనున్నారు.

పంచాయతీల్లో పొలం పిలుస్తోంది..



పొలం పిలుస్తోందిలో సూచనలిస్తున్న ఏవో వాహిణి

సీతంపేట: మండలంలోని రెండు పంచాయతీల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కుడ్డపల్లి, పులిపుట్టి గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి వాహిణి మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేసే వరి, ఇతర పంటలపై ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యానవన పంటల పరిశీలన



జీడిమొక్కల సాగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తవలస గ్రామంలో గిరిజన రైతులు ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేస్తున్న జీడి మొక్క లను ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు మంగళవారం పరిశీలించారు. అలాగే లోవలక్ష్మీపురంలో గోకుల షెడ్‌ను, దుడ్డుఖల్లు పంచాయతీలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ ఉన్నారు.

దోమలతో వ్యాధుల విజృంభణ



పట్టణంలో డెంగీ మాసోత్సవ ర్యాలీ

పాలకొండ రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించకపోవటంతో దోమలు అధికమై ప్రజలు ప్రస్తుత సీజన్‌లో రోగాల బారిన పడే అవకాశం ముందని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రత్న తేజ్ అన్నారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. దోమల కారణంగా వైరల్, డెంగీ తదితర జ్వరాలు విజృంభిస్తాయన్నారు. వర్షాకాల సీజన్‌లో ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జనం మెచ్చిన జగన్నాథుడు



పాలకొండ: వరాహ నరసింహ స్వామి అవతారంలో జగన్నాథస్వామి



వీరఘట్టం: ఓంకారం వద్ద దీపారాధన చేస్తున్న మహిళలు

పాలకొండ: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథస్వామి మంగళవారం వరాహ, నరసింహ అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. హిరా పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి సూర్యనారాయణ ఆధ్వర్యంలో దేవదాయ శాఖ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

భామినిలో..

భామిని: మండలంలోని బత్తిలి శ్రీ జగన్నాథ మందిరంలో దశావతారాల్లో భాగంగా నరసింహావతారంలో జగన్నాథుడు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. హిరా పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. జగన్నాథుడు కొలువైన గీతాగోవింద మఠంలో మఠాధిపతి మదన్మోహన్ దాస్ మహంతి ఆధ్వర్యంలో అష్ట పహరా నామసంకీర్తన చేపట్టారు. భక్తులు గీతా పారాయణం చేపట్టారు.

లోకనాయకా...పాహిమాం...

వీరఘట్టం: జగన్నాథస్వామి రథోత్సవంలో భాగంగా నిర్వహించిన హిరాపంచమి వేడుకలు వీరఘట్టం గుడించ మందిరంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు లింగరాజ్ రథో ఆధ్వర్యంలో సుబద్ర, బలబద్ర సమేత జగన్నాథ స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోకనాయకా...పాహిమాం అంటూ జై జగన్నాథ నామస్మరణతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మికత చోటుచేసుకుంది.

భక్తి పారవశ్యంతో...

పాలకొండ రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కోటదుర్గమ్మ, గారమ్మ సన్నిధులకు మంగళవారం భక్తులు పోటెత్తారు. మొక్కులు చెల్లించే క్రమంలో ముర్రాటలు, ఘటాలు తలదాల్చి కాలినడక అమ్మవార్ల వద్ద వెళ్లారు. ఓ వైపు వర్షం కురుస్తున్నప్పటికి భక్తి పారవశ్యంతో తడుస్తూనే సంబరాలు చేపట్టారు.



గరుగుబిల్లి: రావుపల్లిలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో భజన చేస్తున్న భక్తులు



జియ్యమ్మవలస/జియ్యమ్మవలస రూరల్: చినమేరంగిలో నరసింహ అవతారంలో జగన్నాథుడు

పట్టణ పరిధిలో ఉన్న దుర్గమ్మ దేవస్థానంతో పాటు వీరఘట్టం రహదారిలో, అగ్నిమాపక కేంద్రం వద్ద గల గారమ్మ ఆలయం, వనం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. మేదర వీధికి చెందిన మహిళలు పెద్దెత్తున సామూహిక సంబరాలు చేపట్టారు.

వైభవంగా హిరాపంచమి మహోత్సవం

జియ్యమ్మవలస/ జియ్యమ్మవలస రూరల్ : జగన్నాథుని రథయాత్రలో భాగమైన హిరాపంచమి మహోత్సవాన్ని చినమేరంగి గ్రామంలోని ఆలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.జగన్నాథస్వామి నరసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి గిరిధర పాత్రో ఆధ్వర్యంలో గుండిచ మండపంలో ప్రత్యేక పూజలు చేశారు.వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. మందిరం వద్ద భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



పాలకొండ రూరల్: వర్షంలో సంబరాలు చేపడుతున్న భక్తులు

రావుపల్లిలో..

గరుగుబిల్లి: జగన్నాథ రథయాత్రలో భాగంగా రావుపల్లి గ్రామంలోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ గ్రామ భజన బృందం గురువు బంకపల్లి సూర్యనారాయణవర్మ ఆధ్వర్యంలో భజనలు చేశారు. సర్పంచ్ బొంతాడ మహేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టు తప్పితే.. పల్టీలే....



ఈ చిత్రంలో కనిపిస్తున్న ద్విచక్ర వాహనదారులు మేడ ఒబ్బంగి నుంచి సీతంపేటకు వస్తున్నారు. ఈ మార్గం పూర్తిగా రాళ్లు తేలడంతో అవస్థలు పడుతున్నారు. ఘాట్ రోడ్డు నుంచి దిగుతున్నప్పుడు బ్యాలెన్స్‌గా వాహనం నడపకపోతే పల్టీలు కొట్టే ప్రమాదం పొంచి ఉంది. మండలంలోని కొండాడ నుంచి మేడ ఒబ్బంగికి దాదాపు 3 కిలోమీటర్ల రహదారి నిర్మించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రూ.కోటీ 50 లక్షల నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో రహదారికి మెటల్ వేశారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు రూ.45 లక్షలబిల్లులు అయ్యాయని సర్పంచ్ ముకుంద రావు తెలిపారు. అక్కడితో పనులను వదిలేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు కొట్టుకుపోతుంది. కనీసం 108 వాహనం కూడా గ్రామానికి వెళ్లలేని పరిస్థితి ఉందని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి రహదారిని పూర్తి చేయాలని కోరుతున్నారు. – సీతంపేట

సమ్మె నోటీసు అందజేత



తాడికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి బుద్దేశ్వర రావుకు నోటీసు అందజేస్తున్న ఆశ వర్కర్లు

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు అనుమతి కోరుతూ మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ఆశ కార్యకర్తలు ఆ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావుకు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు కె.నిర్మల, బి.దమయంతి, ఎస్.కృష్ణవేణి తదితరులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని కోరారు. ఒప్పంద జీఓలు అమలు చేయాలని, ప్రభుత్వం అమలు చేసే అన్ని సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్న డిమాండ్లతో ఈ సమ్మెలో తాముకూడా భాగస్వామ్యం కానున్నామని పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులు ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



ఏరియా ఆసుపత్రి వద్ద చంద్రరాయ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

సీతంపేట: సీతంపేట ఏరియా ఆసుపత్రి, దోనుబాయి, కుశిమి, మర్రిపాడు పీహెచ్‌సీలలో ఘనంగా డాక్టర్స్ డే మంగళవారం నిర్వహించారు. వైద్యులు కేక్ కట్ చేసి సిబ్బందికి పంచి పెట్టారు. వైద్య రంగంలో విశేష కృషి చేసిన బిధాన్ చంద్రరాయ్ విగ్రహానికి స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుతో పాటు వైద్య సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలు కొనియాడారు.

నీరు నిండుగా ఉంచాలి



బొడ్డగూడలో నీటి గుంట నిర్మాణం పరిశీలిస్తున్న ఏపీవో

భామిని: ఉపాధి హామీ పథకంలో మంజూరైన నీటి కుంటల్లో నీరు పూర్తి నింపి ఉంచాలని ఏపీవో రేగిడి బాబూరావు సూచించారు. మండలంలోని బొడ్డగూడలో నిర్మాణం పూర్తి చేసుకున్న నీటి కుండీలు, ఇంకుడు గుంతల కొలతలు మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడారు. వృథా నీరు భూమిలో ఇంకేలా చూడాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ బిడ్డిక అనంత్ ఉన్నారు.

ఫిర్యాదుపై అధికారుల స్పందన



సంత-నర్సిపురంలో గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో, ఎంపీడీవో

వీరఘట్టం: మండలంలోని సంత-నర్సిపురం గ్రామానికి చెందిన యజ్జల లక్ష్మణదాసు సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో చేసిన ఫిర్యాదుపై అధికారులు మంగళవారం స్పందించారు. తన నివాస గృహం సమీపంలో చోటు చేసుకున్న స్థల సమస్యపై డీఎల్‌డీవో గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.వెంకటరమణ సంత-నర్సిపురం గ్రామానికి వెళ్లారు. గ్రామ పెద్దలు, ఫిర్యాదుదారుడుతో మాట్లాడి సమస్యను సావధానంగా పరిష్కరించినట్టు ఎంపీడీవో తెలిపారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్

కొమరాడ:

పెద్దఖేర్జిల గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కొమరాడ పీహెచ్‌సీ వైద్యుడు సీహెచ్.అరుణ్‌కుమార్ మంగళవారం వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికిమందులు అందజేశారు. అనంతరం గ్రామంలో వైద్యార్యోగ శాఖ సిబ్బంది తో కలిసి అవగాహన ర్యాలీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలుకురుస్తున్నందున సీజనల్‌వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. దోమ తెరలు వాడాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, జ్వరం వస్తే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

మర్యాదపూర్వక కలయిక



జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్ బాబు

కొమరాడ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో పార్వతీపురం మన్యం జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు నంగిరెడ్డి శరత్ బాబు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలో నిర్వహించిన పార్టీ యువజన విభాగ విస్తృతస్థాయి సమావేశానికి శరత్‌బాబు హాజరయ్యారు. సమావేశం అనంతరం జగన్ మోహన్ రెడ్డిని కలిసి తనకి యువజన విభాగం అధ్యక్షుడి బాధ్యతలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలి



వీరఘట్టం: వైఎస్సార్‌సీపీలో యువతకు ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని పాలకొండ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు పాట్నూరు లక్ష్మణరావు అన్నారు తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశాన్నారు. కూటమి నాయకులు అక్రమంగా పెట్టే కేసులకు భయపడవద్దని త్వరలో రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టి ప్రజల కష్టాల్లో తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారన్నారు.

పూడికలు తీయక అవస్థలు



అవలంగి నీటి సంఘం పరిధిలో పూడికతో ఉన్న కాలువలు చూపిస్తున్న రైతులు

పాలకొండ రూరల్:

మండలంలో ప్రధాన సాగునీటి వనరైన తోటపల్లి కాలువల నిర్వహణ సక్రమంగా లేక అవస్థలు పడుతున్నట్టు రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా అవలంగి నీటి సంఘం పరిధిలో పంట కాలువల్లో పూడికతీతలు చేపట్టక పోవటంతో కాలువల ద్వారా, వర్ష ప్రభావంతో అధిక శాతం నీరు చేరి పంటలు పోతున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ సర్పంచ్ పైల వాసునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. అతే అతివృష్టి లేకుంటే అనావృష్టిలా రైతులు పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవటంతో కాలువల నిర్వహణ పనులు చేయటం లేదన్నారు. దీంతో సదరు నీటి సంఘం పరిధిలో పొట్లి, ఎం.సింగుపురం, జి.వెంకటాపురం, అవలంగి, ఆర్‌బీఆర్.పేట తదితర గ్రామాలకు చెందిన రెండు వేల ఎకరాలకు చెందిన రైతులు అవస్థలు పడుతున్నట్టు మంగళవారం సహచర రైతులతో కలసి కాలువల దుస్థితిని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలన్నారు.

పోలీస్ స్టేషన్‌లను తనిఖీ చేసిన డీఎస్పీ



జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ రాంబాబు

జియ్యమ్మవలస/ జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి,జియ్యమ్మవలస పోలీస్ స్టేషన్‌లను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు మంగళ వారం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌ల పరిసర ప్రాంతాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులపై పోలీస్ సిబ్బందిని ఆరా తీశారు. యూఐ కేసులను తగ్గించాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులను పెంచాలని సూచించారు. సిబ్బంది సమస్య లను అడిగి తెలుసుకున్నారు. అలాగే చినమేరంగి సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి సర్కిల్ పరిధిలో ఉన్న ట్రైనీ ఎస్ఐల తో మాట్లాడారు. ఆయన వెంట సీఐ టి.వి.తిరుపతి రావు,జియ్యమ్మవలస, చినమేరంగి ఎస్ఐలు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



జియ్యమ్మవలస/జియ్యమ్మవలస రూరల్: అల్లువాడలో వాటర్ ట్యాంకు వద్ద చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీపీఓ కొండలరావు

జియ్యమ్మవలస/జియ్యమ్మవలస రూరల్: మండలంలోని అల్లువాడ పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్లు మంగళ వారం నిర్వహించిన పారిశుద్ధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కొండలరావు పరిశీలించారు. వీధి కాలువ లు, రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించి గ్రీన్ అంబాసిడర్లకు పలు సూచనలు చేశారు.వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ధర్మారావు,సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

గరుగుబిల్లి: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ ఎంపీడీఓ ఎల్.గోపాలరావు తెలిపారు. మండలంలోని దళాయివలస, సంతోషపురం, సుంకి, చినగుడబ, పెదగుడబ, శివ్వాం గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను మంగళవారం పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు.చెత్తను ఆరుబయట పారబోయకుండా ఇళ్ల వద్దకు వచ్చే గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలని మహిళలకు సూచించారు. ఆయన వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, ఆశ వర్కర్లు ఉన్నారు.

2.50 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు



సంపన్నగూడ పరిసరాల్లో మొక్కలు నాటేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అటవీ శాఖ కురుపాం రేంజర్ గంగరాజు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం అటవీ శాఖ పరిధిలో 2.50 లక్షల మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు కురుపాం రేంజర్ గంగరాజు తెలిపారు. ఈమేరకు గుమ్మలక్ష్మీపురం అటవీశాఖ సెక్షన్ పరిధిలోని కారివలస బీట్‌లో ప్లాంటేషను, అలాగే కురుపాం మండలంలోని సంపన్నగూడలో ప్లాంటేషన్ నిమిత్తం అటవీ స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టేకు, నీలగిరి, వేప, సరుగుడు, తదితర మొక్కలను అటవీ ప్రాంతంలో నాటనున్నట్లు పేర్కొన్నారు. ఈయన వెంట ఆటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారం



దాత సీతారాంను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మండల కేంద్రానికి చెందిన బొరిగి సీతారాం తన తల్లిదండ్రులు రాఘవులు, ఈశ్వరమ్మ దంపతుల జ్ఞాపకార్థం స్మారక శాశ్వత విద్యాకానుక పేరుతో మంగళవారం నగదు పురస్కారాలు అందజేశారు. విద్యార్థులు బండి త్రివేణి, తులాల సుష్మ, పాలక లహరి ప్రసన్నలకు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున నగదును హెచ్‌ఎం బిడ్డిక భీముడు ఆధ్వర్యంలో అందించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా స్మారక శాశ్వత విద్యాకానుక నగదును ఇకపై ఏటా టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అందజేసేందుకు లక్ష రూపాయలను బ్యాంకు ఖాతాలో డిపాజిట్ చేశామని చెప్పారు. దాతను ఉపాధ్యాయులు సత్కరించారు. స్థానిక సర్పంచ్ బి.గౌరీశంకరరావు, పాఠశాల కమిటీ చైర్మన్ రాజేష్, వర్తక, వైశ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.